MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
SRI SWAMI ASSOCIATES
ARCHITECTS • ENGINEERS • SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissions, LRS, BRS, Tax Assessments
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణ దరఖాస్తు కొరకు సంప్రదించండి.
GHMC, HMDA, DTCP, TS-bpass - Layout`s, Building Permissions
H.No. 11-5-565, Bhagya Laxmi Towers, Opp: GHMC Circle Office, Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

HAPPY Independence DAY
# క్రైమ్ మిర్రర్
Voice of Anti Corruption
## తెలంగాణ జిల్లాలు
శనివారం 16-05-2026 పబ్లిషింగ్ సెంటర్ : హైదరాబాద్

# నీటి ఎద్దడి కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలి

- మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర కౌన్సిల్ సమావేశం....
- రాజకీయాలకతీతంగా అన్ని వార్డులో నీటి సరఫరా జరిగేలా చూడాలి...
- యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు
- ప్రైవేట్ బోర్ల లీజు,అదనపు ట్యాంకర్ల ఏర్పాటు...
- మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్



5లో

# పోక్సో కేసులో కానిస్టేబుల్‌కు 30 ఏండ్ల జైలు



2లో

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో కానిస్టేబుల్ వరదరాజ్ సుదేష్ అలియాస్ ఉమేష్ (39)కు కోర్టు 30 ఏండ్ల జైలుశిక్ష విధించింది. జైలుశిక్షతోపాటు 12వేల జరిమానా చెల్లించాలని నాంపల్లిలోని ప్రత్యేక పోక్సోకోర్టు జడ్జి ఉదయ్‌భాస్కర్‌రావు శుక్రవారం తీర్పు వెల్లడించారు. బాధిత బాలికకు రూ.లక్ష పరిహారం చెల్లించాలని హైదరాబాద్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ మారెళ్ల రమాదేవి కథనం ప్రకారం.. 2020లో వరుసకు మామ అయిన కానిస్టేబుల్ మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధిత బాలిక తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు

# సుందరీకరణకు మోక్షమెప్పుడో..?



- సుదీర్ఘ కాలంగా కొనసాగుతున్న రాముని చెరువు పనులు
- మురుగు నీటి తొలగింపులో తీవ్ర జాప్యం
- వర్షాలు కురిస్తే అర్ధాంతరంగా వదలాల్సిన పరిస్థితి
- రూ.3.50 కోట్లు కేటాయించినా ముందుకు సాగని పనులు

జిల్లా కేంద్రంలో ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక పార్కు రాముని చెరువు సుందరీకరణ పనులకు సంవత్సరాలు గడుస్తు న్నా మోక్షం లభించడంలేదు. ఏళ్ల తరబడి కొనసాగుతున్న అభివృద్ధి పనుల కారణంగా ప్రజలకు సెలవులు, ఖాళీ సమయాల్లో ఉల్లాసంగా గడపలేని పరిస్థితి నెలకొంది. గతంలో చెరువు కట్ట ఇరువైపులా పచ్చని చెట్లు, వీధిలైట్లు, కూర్చునేందుకు బెంచీలతో కళకళలాడేది. సందర్శకులతో నిత్యంబిజీగా ఉండేది. ముఖ్యంగా సంధ్యా సమయాల్లో ఆ ప్రాంతమంతా ఆహ్లాదకర వాతావరణాన్ని అందజేసేది. వృద్ధులు, వాకర్స్ కాలక్షేపం కోసం చెరువు కట్టపై గంటల తరబడి గడిపేవారు. ప్రస్తుతం పరిస్థితి అందుకు భిన్నంగా తయారైంది. సుందరీకరణ పేరుతో చేపడుతున్న పనుల్లో జాప్యం కారణంగా చెరువు ప్రాంతం కళావిహీనంగా దర్శనమిస్తోంది. డ్రైనేజీల నుంచి వచ్చే మురుగు నీటి కారణంగా తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న పనులు సుదీర్ఘకాలంగా కొనసాగుతుండటమే దీనికి ప్రధాన కారణంగా తెలుస్తోంది.

**మంచిర్యాల, (క్రైమ్ మిర్రర్):** చెరువు సుందరీకరణలో భాగంగా మొదట వివిధ ప్రాంతాల నంచి వచ్చే డ్రైనేజీల మురుగు నీటిని పూర్తిగా తొలగించి, పూడికతీయాలని ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా చెరువు అడుగు భాగం నుంచి శుభ్రం చేయాలని ప్రణాళికలు రూపొందించారు. ఈక్రమంలో చెరువుకు పడమర వైపు ఫుట్ వే బ్రిడ్జి వద్ద దాదాపు నాలుగు సంవత్సరాల క్రితం మత్తడికి గండి కొట్టారు. అందులో నుంచి మురుగు నీరు బయటకు వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. అయితే సంవత్సరాలు గడుస్తున్నా మురుగు నీటిని బయటకు పంపకపోగా, సుందరీకణ పనులు కూడా వేగం పుంజుకోవడం లేదు. చెరువు సుందరీకరణపై అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడంతో పనుల్లో తీవ్ర జాప్యం జరుగుతోందనే విమర్శలు వస్తున్నాయి. వేసవి, శీతాకాలంలో గండి నుంచి నీరు బయటకు వెళ్తుండగా, తిరిగి వర్షాకాలంలో పెద్ద మొత్తంలో నీరు చేరుతోంది. పైగా ఇటీవల మత్తడికి చేసిన గండిని కూడా పూర్తిగా మూసివేశారు. దీంతో

మిగతా 2లో

# సుందరీకరణకు మోక్షమెప్పుడో?

చెరువులోని మురుగునీరు బయటకు వెళ్లేందుకు అవకాశం లేకుండా పోయింది. మురుగు నీటిని తొలగిస్తామని చెబుతున్న అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టకపోవడంతో ఈ పరిస్థితి నెలకొంటుంది. ప్రస్తుతం వేసవికాలం అయినందున నీటినంతా బయటకు పంపి, పూడిక తీయిస్తే చెరువు మొత్తం ఖాళీ అయి, వర్షాకాలంలో కొత్తనీరు చేరే అవకాశం ఉంటుంది.రాముని చెరువు సుందరీకరణ కోసం నాలుగేళ్ల కిందట టీయూఎఫ్ఐడీసీ (తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్టక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్) నుంచి రూ 3.50 కోట్లు మంజూరు చేశారు. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపట్టవలసి ఉండగా, తాత్సారం చేయడంతో చెరువు అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రభుత్వం నుంచి అనుమతులు, డీపీఆర్ తయారీ, టెండర్ల నిర్వహణ అంటూ దాదాపు రెండు సంవత్సరాలపాటు పనులు చేపట్టలేదు. రెండేళ్ల క్రితం పనులు ప్రారంభించినప్పటికీ నత్తనడక జరుగుతుండటంతో పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్నచందంగా తయారైంది. సుందరీకరణ పనుల్లో భాగంగా చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్, రెండు పక్కల ఇనుప గ్రిల్స్, హైటెక్‌సిటీ, జాఫర్‌నగర్ ప్రాంతాల నుంచి చెరువులో బతుకమ్మల నిమజ్జనం కోసం మెట్ల నిర్మాణం, తదితర పనులు చేపట్టవలసి ఉంది. ఇందులో కేవలం ఇనుప గ్రిల్స్ ఏర్పాటు పనులు దాదాపుగా పూర్తికాగా, రెండు చోట్లా మెట్ల నిర్మాణం, వాకింగ్ ట్రాక్, ప్రజలు సేదదీరేందుకు బెంచీల ఏర్పాటు, కట్టవెంట విద్యుత్ దీపాలు ఇప్పటికీ ఏర్పాటు చేయలేదు. చెరువులో పెరిగిన గుర్రపు డెక్క, తామర, పిచ్చిమొక్కలతో పూడికతీత పనులు ముందుకు సాగడం లేదు. ఈ వేసవిలోపు పనులన్నీ పూర్తయ్యే పరిస్థితులు కనిపించడంలేదు. సుందరీకరణలో భాగంగా రాముని చెరువులో ప్రస్తుతం ఉన్న మురుగునీరు, పూడికనంతా తొలగించి, కొత్త నీటితో నింపాలని నిర్ణయించారు. అలా చెరువును శుద్ధి చేసిన అనంతరం అందులో టూరిజం శాఖ నుంచి బోటింగ్ ఏర్పాటు చేయడం ద్వారా పార్కుగా అభివృద్ధి చేయాలని ప్రణాళికలు సిద్ధం చేశారు. జిల్లా కేంద్రంలో ప్రజలకు ఆహ్లాదం కలిగించేందుకు అందుబాటులో ఉన్న ఏకైక చెరువు కావడంతో అన్ని ఏర్పాట్లు చేయడం ద్వారా అభివృద్ధి చేపట్టాలనే నిర్ణయానికి వచ్చారు. రాముని చెరువులో బోటింగ్, ఇతర ఏర్పాట్లు చేస్తే ప్రజలకు ఆహ్లాదకర వాతారణం కల్పించినట్లు అవుతుంది. అయితే సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆ పనులు ముందుకు సాగకపోవడంతో ప్రజలకు శాపంగా మారింది. చెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాల్సి ఉండగా, అపనులు కూడా మరుగున పడ్డాయి. పట్టణంలోని హైటెక్‌సిటీ, జన్మభూమి నగర్, లక్ష్మీనగర్, గౌతమీనగర్, జాఫర్ నగర్ కాలనీల ప్రజలు చెరువు కట్టపై వాకింగ్ చేస్తుంటారు. నిత్యం వందలాది మంది ఉదయం, సాయంత్రం వేళల్లో ఇక్కడికి వస్తుంటారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని 2017లో అప్పటి జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్ సుమారు రూ. 80 లక్షలతో చెరువు అభివృద్ధికి పూనుకున్నారు. చెరువు చుట్టూ కట్ట నిర్మించి, మట్టితో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయించారు. వాకింగ్ ట్రాక్ ప్రజలకు ఎంతగానో ఉపయోగపడేది. కాలక్రమంలో నిర్వహణ లోపంతో కట్టపై పిచ్చి మొక్కలు మొలవడంతో ప్రజలు అక్కడికి రావడం మానేశారు. పట్టణంలో ప్రజలకు అందుబాటులో ఉన్న ఏకైక చెరువు కావడంతో ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి సుందరీకరణ పనులు త్వరగా చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# ఏసీ పేలి ఇల్లంతా మంటలు

వెంగళరావునగర్, మే 15 :అందరూ గాఢ నిద్రలో ఉండగా అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఇల్లంతా దట్టంగా పొగ అలుముకుంది. మెలకువ వచ్చి బాల్కని తలుపు తెరిచి చూస్తే.. ఏసీ కంప్రెషర్ నుంచి మంటలు వ్యాపించి ఉన్నాయి. కాసేపటికి కంప్రెషర్ పేలిపోయింది. కంగారుతో బెడ్రూమ్ డోర్ తెరిచిన వెంటనే దట్టంగా పొగ అలుముకుంది. ఏసీలోంచి నిప్పురవ్వలు వచ్చి మంటలు చెలరేగాయి. భయాందోళనకు గురైన కుటుంబీకులు పరుగులు తీసి ప్రాణాలు దక్కించుకున్నారు. కష్టపడి కూడబెట్టిన రూ.10.60 లక్షలు, అరకిలో బంగారు ఆభరణాలతో పాటు సర్వస్వం కాలి బూడిదయ్యాంటూ బాధితులు కన్నీరుమున్నీరయ్యారు. మధురానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని యూసుఫ్‌గూడలో గురువారం అర్ధరాత్రి ఈ ఘటన చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. యసూఫ్‌గూడ బస్తీ విశ్వవిహార్ అపార్ట్‌మెంట్స్‌లోని 4వ అంతస్తులో ఉద్దగిరి త్రివేణి(59) అనే వైద్యురాలు తన తల్లిదండ్రులు వై.ప్రసాదరావు(91), వై.లక్ష్మి(81)తో కలిసి నిద్రిస్తున్నారు. గురువారం అర్ధరాత్రి దాటాక గదిలో పొగ నిండుకున్నట్లు వాసన రావడం తో త్రివేణికి మెలకువ వచ్చిం ది. రూమ్‌లోని ఏసీలోంచి నిప్పురవ్వలు ఎగిరిపడి మంటలు వచ్చా యి. దీంతో తల్లిదండ్రులను అప్రమత్తం చేసి సురక్షితంగా వారిని బయటకు తెచ్చింది. మంటలు చెలరేగి ఇంట్లో ఉన్న ఫర్నీచర్, అల్మారాల్లో దాచుకున్న అరకిలో కు పైగా బంగారు ఆభరణాలు, 6 కిలోల వెండి సామాగ్రి, రూ.10.60 లక్షల కరెన్సీ నోట్ల కట్టలు మంటల్లో కాలి బూడిదయ్యాయి.

# పోక్సో కేసులో కానిస్టేబుల్‌కు 30 ఏండ్ల జైలు

పోలీసులు కేసు నమోదు చేశారు. టీ ఇవ్వమని అమ్మమ్మ బాధిత బాలికను కోరగా సదరు బాలిక మొదటి అంతస్తులో ఉన్న గదిలోకి వెళ్లడంతో తలుపులు మూసి బాలికపై లైంగిక దాడికి పాల్పడినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఇతరులకు చెబితే బాధిత బాలిక సోదరుడిపై గంజాయి కేసు నమోదు చేయిస్తానని బెదిరించినట్టు తెలిపారు. ఈ ఘటన గురించి నిందితుడి భార్యకు వివరించగా ఆమె సైతం బాలికపై బెదిరింపులకు పాల్పడినట్టు వివరించారు. భయంతో బాలిక మౌనం పాటించడాన్ని ఆసరాగా తీసుకుని పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్టు తెలిపారు. దీంతో ధైర్యంగా బోయిన్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేసినట్టు బాధిత బాలిక తల్లి తెలిపింది. 12ఏళ్ల మైనర్ బాలిక వాంగ్మూలాన్ని అధికారులు నమోదు చేసి సాక్ష్యాధారాలను సేకరించి కోర్టుకు చార్జ్‌షీట్ సమర్పించారు. సుదీర్ఘ విచారణ చేపట్టిన కోర్టు నిందితుడు నేరం చేసినట్టు రుజువుకావడంతో శిక్ష ఖరారు చేశారు. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా జైలుశిక్షను అనుభవించాల్సి ఉంటుందని తీర్పులో వెల్లడించారు.




# సమ్మర్ క్యాంప్ ప్రారంభించిన ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** మహేశ్వరం నియోజకవర్గంలోని 58వ డివిజన్ ప్రశాంతి హిల్స్ లో బీ ద చేంజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థుల కోసం నిర్వహిస్తున్న ఉచిత కంప్యూటర్ ఎడ్యుకేషన్, కోడింగ్, రోబోటిక్స్ మరియు ఏఐ వేసవి శిక్షణ తరగతులను మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఇలాంటి వినూత్న కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు టెక్నాలజీపై అవగాహన కల్పించే సమ్మర్ క్యాంపులు నిర్వహించడం వల్ల వారి మానసిక వికాసం, సృజనాత్మకత మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కోడింగ్, రోబోటిక్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాల్లో విద్యార్థులు ముందంజలో నిలవాలంటే ఇలాంటి శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అలాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న బీ ద చేంజ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీ ద చేంజ్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘ ఆధ్వర్యంలో ఎంపీడీవో షేక్ శీలార్ సాహెబ్ కు వినతి పత్రం

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం తిరుమలాయపాలెం మండల ఎంపీడీవో షేక్ శీలార్ సాహెబ్ కు వినతిపత్రం అందజేశారు అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం పాలేరు డివిజన్ కమిటీ సభ్యులు దాసరి మహేందర్ నేరుసుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకుందాం కేంద్రంలో ఉన్న నరేంద్ర మోడీ బిజెపి ప్రభుత్వం దొడ్డి దారి నా కొత్తగా తీసుకువచ్చిన వివి రామ్ జి బిల్లును వెంటనే రద్దు చేయాలని పెండింగ్ వేతనాలు వెంటనే రిలీజ్ చేయాలని పని ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని 200 రోజులకు పని దినాన్ని కల్పించాలని రోజుకు 600 కూలి ఇవ్వాలని డిమాండ్ చేశారు లేనియెడల భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు డిమాండ్ చేశారు ఈ యొక్క కార్యక్రమంలో పశుపొంగు వీరన్న గుండుమల్ల ఉపేందర్ తుళ్లూరు నాగేశ్వరావు కొమ్ము నాగేశ్వరావు పోలేపొంగు ముత్తయ్య సిపిఎం పార్టీ శ్రేణులు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



# విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతికి ప్రత్యేక కార్పొరేషన్ అవసరం

- రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరిన జిల్లా అధ్యక్షుడు ఆకునూరి సతీష్ చారి



**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** విశ్వబ్రాహ్మణుల సమగ్ర అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఆకునూరి సతీష్ చారి డిమాండ్ చేశారు. విశ్వబ్రాహ్మణ సమాజానికి సామాజిక, ఆర్థిక, విద్యా రంగాల్లో ప్రోత్సాహం కల్పించేందుకు ప్రత్యేక కార్పొరేషన్ అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విశ్వబ్రాహ్మణుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. నూతనంగా ఏర్పాటు చేసే కార్పొరేషన్‌కు విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ ఐక్య సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోజు బిక్షపతిని చైర్మన్‌గా నియమించాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. విశ్వబ్రాహ్మణ యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక పథకాలు అమలు చేయాలని, విద్యార్థులకు విద్యా రుణాలు, యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణలు అందించాలని సూచించారు. అలాగే చిన్న వ్యాపారాలు ప్రారంభించేందుకు ఆర్థిక సహాయం అందించి విశ్వబ్రాహ్మణ కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేయాలని కోరారు. ప్రభుత్వం త్వరితగతిన నిర్ణయం తీసుకొని విశ్వబ్రాహ్మణ సమాజానికి న్యాయం చేయాలని ఆకునూరి సతీష్ చారి విజ్ఞప్తి చేశారు.

# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన

- సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి

**చౌటుప్పల్,మే 15,క్రైమ్ మిర్రర్ :** పిఏసిఎస్ చౌటుప్పల్ ఆధ్వర్యంలో ఎస్ లింగోటంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి సందర్శించారు.ధాన్యం కొనుగోలు సెంటర్ ఇన్చార్జ్ నుండి కొనుగోలు వివరాలను, అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. లారీలు త్వరితగతిన దిగుమతి కావడం లేదని ఐదు లేక ఆరు రోజులకు దిగుమతి అవుతున్నాయని అక్కడి నిర్వాహకులు వారికి తెలియజేశారు. దీనితో ప్రతిరోజు కాంటాలు వేయలేకపోతున్నామని తెలిపారు. తూకం వేసిన బస్తాలు ఎగుమతి కాక తూకం తగ్గుతున్నాయని వివరించారు. దీనితో స్పందించిన సింగిల్ విండో చైర్మన్ జిల్లా సివిల్ సప్లై మేనేజర్ కి ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని , హమాలీలను పెంచుతున్నామని త్వరగా దిగుమతి అవుతాయని,అలాగే తాళ్ల సింగారం, ఎస్ లింగోటం సెంటర్లను చౌటుప్పల్ ఏఎంసి గోదాములకు కేటాయిస్తామని తెలిపినట్లు చైర్మన్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ మాధవరెడ్డి, చెనగోని వెంకటేశం, ఆకుల అశోక్, పల్చం రమేష్, భారత రాజు లింగస్వామి, ఉప్పు కృష్ణ, వై కృష్ణయ్య, కార్యదర్శి వై రమేష్,నరేష్, సిబ్బంది పాల్గొన్నారు.



# రైతులు సాగు ఖర్చులు తగ్గించాలి

- సేంద్రీయ వ్యవసాయ పద్ధతిలో సాగు చేయాలి..
- వ్యవసాయ శాస్త్రవేత్త ప్రభావతి
- వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య
- సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి



**చౌటుప్పల్, మే 15, క్రైమ్ మిర్రర్ :** రైతులు సాగు ఖర్చులు తగ్గించాలని, సేంద్రియ వ్యవసాయ పద్ధతిలో సాగు చేసి అధిక దిగుబడి పొందాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య తెలిపారు. శుక్రవారం చౌటుప్పల్ మండలం చిన్నకొండూరు గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంను మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయం ప్రధాన శాస్త్రవేత్త ప్రభావతి పాల్గొని మాట్లాడుతూ.. రైతులు ఎకరానికి 2బస్తాల యూరియా మాత్రమే వాడాలని , వానాకాలం సర్టిఫైడ్ విత్తనాలనే వినియోగించాలని, రైతులు సాగు ఖర్చులు తగ్గించాలని, జీలుగ వేసి కలియ దున్నా కోవాలనని కోరారు. అలాగే రైతు సర్టిఫైడ్ పురుగు మందులను మాత్రమే కొనాలని చెప్పారు. నరుమడిలో 2కేజీ ల గుళికలు వేయాలని చెప్పారు. అనంతరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య మాట్లాడుతూ.. రైతులు సేంద్రీయ వ్యవసాయం పద్ధతిలో సాగు చేయాలని,రసాయనిక ఎరువులు, పురుగు మందులు తక్కువ మోతాదులో వాడాలని కోరారు. సింగిల్ విండో చైర్మన్ చింతల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ... రైతులు పంట మార్పిడి పద్ధతి పాటించాలని కోరారు.అలాగే రైతులను ఆయిల్ పామ్ సాగు చేయవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు,చిన్నకొండూరు గ్రామ సర్పంచ్ ,ఉప సర్పంచ్ ,పెద్దకొండూరు సర్పంచ్ ,సింగిల్ విండో డైరెక్టర్ కృష్ణ , మండల వ్యవసాయ అధికారి , సీఈఓ , వ్యవసాయ విస్తరణ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# తెలంగాణ పంచాయతిరాజ్ ట్రిబ్యునల్ చైర్మన్ సూధిని రాంరెడ్డికి ఘన సత్కారం

**క్రైమ్ మిర్రర్ (రంగారెడ్డి ప్రతినిధి):** మాడ్గుల మాజీ ఎంపిపి, టి.పి.సి.సి కార్యదర్శి సూధిని రాంరెడ్డి తెలంగాణ పంచాయతిరాజ్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టిన సందర్భంగా నర్సాయపల్లి సర్పంచ్ కొత్త జ్యోతిగౌడ్, మాజీ ఎంపిటిసి సభ్యులు కొత్త పాండుగౌడ్ దంపతులు తమ కుటుంబ సభ్యులతో కలిసి ఘన సత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్త గౌతమ్ గౌడ్, కొత్త లిఖిత గౌడ్‌తో పాటు కుటుంబ సభ్యులు శాలువాలు కప్పి సూధిని రాంరెడ్డి ని సన్మానించారు. అలాగే మాడ్గుల మండల కాంగ్రెస్ అధ్యక్షులు, ఏఎమ్‌సి మాజీ చైర్మన్ భట్టు కిషన్ రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు తాండ్ర (కాయితి) సాయిరెడ్డి, అభ్యుదయ భారత్ ఫౌండేషన్ వైస్ చైర్మన్ సూధిని మనోహర్ రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగి సూధిని లక్ష్మారెడ్డి సర్పంచ్ దంపతులు, కాంగ్రెస్ నాయకులు కలిసి శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాడ్గుల మాజీ సర్పంచ్ కాట్ల



యాదయ్య గౌడ్, ఉపసర్పంచ్ సూధిని శరత్ రెడ్డి, వార్డ్ మెంబర్ తోట జంగయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పద్మనాభరెడ్డి, కడారి నిరంజన్ యాదవ్, దుర్గాప్రసాద్, ముద్దం కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జూలూరు ధాన్యం కొనుగోలు కేంద్రం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- ధాన్యం లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలి
- రోజు 8 నుంచి 10 లారీలు లోడ్ అయ్యేలా చర్యలు చేపట్టాలి...
- యాదాద్రి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి

**యాదాద్రి జిల్లా,మే15, క్రైమ్ మిర్రర్:** జిల్లాలో రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ,లోడింగ్ ప్రక్రియలో ఎలాంటి జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు. శుక్రవారం పోచంపల్లి మండలం జూలూరు గ్రామంలోని పి.ఏ.సి.ఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్రంలో జరుగుతున్న ధాన్యం కొనుగోలు ప్రక్రియపై అధికారులను, నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.ధాన్యం కొనుగోలు ప్రారంభించి ఎన్ని రోజులు అయ్యిందని, ఇప్పటి వరకు ఎంత మేర ధాన్యం కొనుగోలు చేశారని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం కొనుగోలు కేంద్రంలో ఎంత ధాన్యం నిల్వ ఉన్నాయని ఆరా తీశారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వేగంగా కొనుగోళ్లు కొనసాగించాలని సూచించారు. రోజుకు ఎన్ని లారీల ధాన్యం లోడింగ్ చేసి పంపుతున్నారని అడిగి తెలుసుకున్నారు.లారీలు సరిపడా ఉన్నాయా అని ఆరా తీశారు.లారీలు తక్కువగా రావడం వల్ల కాంటా ప్రక్రియలో ఏమైనా ఆలస్యం జరుగుతుందా అని అడిగి తెలుసుకున్నారు. రైతులు ధాన్యాన్ని కేంద్రానికి తీసుకొచ్చిన తర్వాత ఎక్కువ సమయం వేచి ఉండాల్సిన పరిస్థితి రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈరోజు నుంచే ప్రతిరోజూ కనీసం 8 నుంచి 10 లారీలు లోడ్ అయ్యేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అందుకు అనుగుణంగా ధాన్యం కాంటా వేయాలని తెలిపారు. మిల్లుల వద్ద ధాన్యం వెంటనే అన్‌లోడ్ అయ్యేలా చూడాలన్నారు. ధాన్యం కొనుగోలు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో ఆలస్యం చేయవద్దని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై మేనేజర్ హరికృష్ణ,సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# నాణ్యమైన విద్య అందించాలి

కాకతీయ స్కూల్ ప్రారంభోత్సవంలో చైర్ పర్సన్ సంధ్యారాణి



**రామకృష్ణాపూర్, మే 15 (క్రైమ్ మిర్రర్):** క్యాతనపల్లి మున్సిపాలిటీ గద్దెరాగడి 8వ వార్డులో కాకతీయ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాకతీయ స్కూల్‌ను మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ గోడిశెల సంధ్యారాణి,రాజారమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటులో ఉండేలా ఫీజు నిర్మాణం ఉండాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని సౌకర్యాలు కల్పించాలని యాజమాన్యాన్ని కోరారు. ఐఐటి,నీట్ ఫౌండేషన్, ఒలింపియాడ్ శిక్షణ అందించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, నైతిక విలువలు, పోటీ తత్వం పెంపొందించేలా పాఠశాలలు పనిచేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ మిట్టపల్లి సరిత,శ్రీనివాస్, పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ నూతన గృహాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్ పర్సన్

పేదవాడి ఇంటి కలలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇంటి పథకం...

మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్

**చౌటుప్పల్,మే 15, క్రైమ్ మిర్రర్:** పేదవాడి ఇంటి కలలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ బంగారిగడ్డ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో యండి. పర్వీన్,యస్ కె. ఫరీన్ లు నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ నూతన ఇళ్ల గృహప్రవేశానికి చౌటుప్పల్ మున్సిపల్ చైర్ పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్,వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని వారి చేతుల మీదుగా నూతన గృహాన్ని ప్రారంభించి లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం పేదవాడి ఇంటి కలలను నెరవేర్చేందుకు ఇందిరమ్మ ఇంటి పథకాన్ని అమలు చేస్తూ ఆసరాగా ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు అతిథులను శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో 20వ వార్డు కౌన్సిలర్ యండి హన్నుబాయ్,17 వ వార్డ్ కౌన్సిలర్ చింతల ఉమామహేశ్వరి సాయిలు,షాదీ ఖానా చైర్మన్ ఎస్కె కరీం,కో-ఆప్షన్ మెంబర్స్ యండి బాబషరీఫ్, సందగళ్ళ విజయ సతీష్,పస్తం గంగారాములు, ఎస్కె జానీ బాబు,షాదీ ఖానా మాజీ చైర్మన్ ఎండి ఎజాస్ పాషా,ఎండి ఇబ్రహీం, 20వ వార్డు అధ్యక్షులు ఉడుగు వెంకటేశం గౌడ్, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు యండి చోటే బాయ్, యండి వాహిద, మిరియాల సునీత, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కుటుంబ సభ్యులుతదితరులు, పాల్గొన్నారు.



# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

జర్నలిస్టుల హక్కుల సాధనకు ప్రెస్ క్లబ్ కట్టుబాటు

నిర్భయ జర్నలిజానికి ప్రెస్ క్లబ్ పూర్తి మద్దతు

బాధ్యతాయుత వార్తలతో ప్రజల్లో విశ్వాసం పెంపొందించాలి : మిన్నుభాయ్




**క్రైమ్ మిర్రర్, భూపాలపల్లి ప్రతినిధి:** ప్రజల సమస్యలను నిష్పక్షపాతంగా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం సాధించడమే మహాదేవపూర్ ప్రెస్ క్లబ్ ప్రధాన లక్ష్యమని ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మిన్నుభాయ్ పేర్కొన్నారు. గురువారం మహాదేవపూర్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొలి సర్వసభ్య సమావేశంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధులు, కార్యవర్గ సభ్యులు, పాత్రికేయులు పాల్గొన్నారు. సమావేశాన్ని ఉద్దేశించి అధ్యక్షుడు మిన్నుభాయ్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యలపై బాధ్యతాయుతంగా స్పందించడం వల్లే మండల ప్రజల్లో పాత్రికేయులపై, ప్రెస్ క్లబ్‌పై విశ్వాసం పెరిగిందన్నారు. ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడంలో ప్రెస్ క్లబ్ మరింత చురుకుగా పనిచేస్తుందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను స్థానిక పాత్రికేయుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

### పాత్రికేయుల సంక్షేమానికి ప్రాధాన్యం

పాత్రికేయుల అభ్యున్నతి కోసం ప్రెస్ క్లబ్ కట్టుబడి పనిచేస్తోందని మిన్నుభాయ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పాత్రికేయులకు కేటాయించిన నివాస స్థలాల సమస్యను త్వరితగతిన పరిష్కరించేందుకు గౌరవ మంత్రి, జిల్లా కలెక్టర్, జిల్లా అటవీ అధికారులను కలిసి విజ్ఞప్తి చేయనున్నట్లు వెల్లడించారు.

### నిష్పక్షపాత వార్తలకు అండ..

వార్తల ప్రచురణలో పాత్రికేయులు నిర్భయంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, అలాంటి జర్నలిస్టులకు ప్రెస్ క్లబ్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. కుల, మత, రాజకీయ భేదాలకు అతీతంగా ప్రతి జర్నలిస్టును సమాన గౌరవంతో ప్రెస్ క్లబ్ సభ్యునిగా ఆదరిస్తామని తెలిపారు.

### సీనియర్ జర్నలిస్టులకు గౌరవం

ఏళ్ల తరబడి పాత్రికేయ వృత్తిలో సేవలందిస్తూ ప్రజల్లో విశ్వాసం సంపాదించిన సీనియర్ జర్నలిస్టులకు సముచిత స్థానం, గౌరవం కల్పించడం జరుగుతుందని పేర్కొన్నారు. సమావేశంలో పాత్రికేయ నిబంధనలు, బాధ్యతలు, ప్రెస్ క్లబ్ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక తీర్మానాలు ఆమోదించారు. సర్వసభ్య సమావేశంలో తీసుకున్న నిర్ణయాలకు కట్టుబడి ఉంటామని సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఎస్.డి. జమీల్, ఉపాధ్యక్షుడు దుర్గయ్య, ప్రధాన కార్యదర్శి షఫీ, కార్యవర్గ సభ్యులు మరియు పాత్రికేయులు అయిత రాజిరెడ్డి, అనిల్ కుమార్, శ్రీనివాస్, భాస్కర్, మునవ్వర్, సంతోష్, శశాంత్, అజ్జు, తులసి నగేష్, అన్వర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయాన్ని అందజేసిన ఎమ్మెల్యే

కోమటి రెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా 2 లక్షల ఆర్థిక సాయం అందజేత...



**చౌటుప్పల్,మే15, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ మున్సిపాలిటీ 14వ వార్డుకు చెందిన పబ్బు శివ అనారోగ్యంతో మరణించారు.వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేస్తానని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి హామీ ఇచ్చారు. ఇచ్చిన హామీ మేరకు కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ద్వారా 2 లక్ష రూపాయలు ఆర్థిక సహాయం చెక్కును శుక్రవారం చౌటుప్పల్ పట్టణ లక్కారం గ్రామ పరిధిలోని మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి క్యాంప్ కార్యాలయంలో చెక్కును బాధిత కుటుంబానికి మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, ఉబ్బు వెంకటయ్య, మునుగోడు ఎన్నికల ఇన్చార్జ్ పబ్బు రాజు గౌడ్ ల చేతుల మీదగా అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి, సహకరించిన స్థానిక నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షులు,కో ఆప్షన్ మెంబర్స్, నాయకులు, కార్యకర్తలు,తదితరులు, పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల పనులు వేగవంతం చేయాలి

32వ డివిజన్‌లో అదనపు కలెక్టర్, మేయర్ సమీక్ష



**మంచిర్యాల మే 15 (క్రైమ్ మిర్రర్):** మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 32వ డివిజన్‌లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. చంద్రయ్య, మేయర్ దర్ని మధుకర్ సూచించారు. శుక్రవారం డివిజన్‌లో పర్యటించిన వారు ఇళ్ల నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఇళ్ల నిర్మాణాల ఆలస్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత గుత్తేదారులను పిలిపించి పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. అనంతరం డివిజన్‌లోని పలు కాలనీల్లో తిరిగి స్థానిక సమస్యలను పరిశీలించారు. ప్రజల నుంచి సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అన్వేష్, డివిజన్ అధికారులు, హౌసింగ్ బోర్డు సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, స్థానిక కాంగ్రెస్ నాయకులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

# నీటి ఎద్దడి కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలి

- మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర కౌన్సిల్ సమావేశం....
- రాజకీయాలకతీతంగా అన్ని వార్డులో నీటి సరఫరా జరిగేలా చూడాలి...
- యాదాద్రి జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావు
- ప్రైవేట్ బోర్ల లీజు,అదనపు ట్యాంకర్ల ఏర్పాటు...
- మున్సిపల్ చైర్ పర్సన్ మోగుదాల పావని రమేష్ గౌడ్





**చౌటుప్పల్,మే15, క్రైమ్ మిర్రర్ :** చౌటుప్పల్ ప్రజలకు వేసవిలో నీటి ఎద్దడి కలగకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని యాదాద్రి జిల్లా జాయింట్ కలెక్టర్ భాస్కర్ రావు తెలిపారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు భాస్కర్ రావు అధ్యక్షతన అత్యవసర కౌన్సిల్ సమావేశంను నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల నేపథ్యంలో జరిగిన ఈ సమావేశంలో అదనపు కలెక్టర్, స్థానిక ఆర్డిఓ వి.శేఖర్ రెడ్డి తో కలిసి వార్డుల వారీగా తాగునీటి సమస్యలపై కౌన్సిలర్లతో సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. వేసవి దృష్ట్యా ప్రజలకు ఎటువంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపల్ యంత్రాంగంపై ఉందన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్ని వార్డులలో సమానంగా నీటి సరఫరా జరిగేలా చూడాలని చైర్‌పర్సన్‌కు సూచించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా మున్సిపల్ కమిషనర్,ఏఈ క్షేత్రస్థాయిలోని వాటర్ మెన్లతో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అవసరమైతే ప్రైవేట్ బోర్ల లీజు, అదనపు ట్యాంకర్ల ఏర్పాటు: చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ ఈ సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ.. చౌటుప్పల్ పట్టణంలో నీటి ఎద్దడిని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఇప్పటికే అన్ని వార్డుల్లో సమృద్ధిగా నీరు ఉన్న బోర్లను గుర్తించామని కలెక్టర్కు తెలిపారు. అవసరమైన చోట ప్రైవేట్ బోర్లను లీజుకు తీసుకోవడం జరిగిందని, అదనంగా మరో 6 నీటి ట్యాంకర్లను కూడా లీజుకు తీసుకుని ప్రజలకు నీటి ఇబ్బంది లేకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎన్ వెంకటేశ్వర్ నాయక్ మాట్లాడుతూ.. అదనపు కలెక్టర్ ఆదేశానుసారం ప్రజా ప్రతినిధుల సూచనలు, సలహాలు తీసుకుంటూ ప్రజలకు నీటి కొరత లేకుండా మా టెక్నికల్ టీం, వాటర్ మెన్ లతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, వార్డు కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఆర్ఓ అంజయ్య, ఏఈ నితీష్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ రఘుపతి, టీడబ్ల్యూఐ సంతోష్ కుమార్, వాటర్ మెన్లు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# పుస్తక పఠనమే విజ్ఞానానికి మార్గం






- డీఈఓ రమేష్ కుమార్

**క్రైమ్ మిర్రర్, కల్వకుర్తి (నాగర్ కర్నూల్):** గ్రంథాలయ దినోత్సవం సందర్భంగా జిల్లా గ్రంథాలయంలో విద్యా వారోత్సవాల ఉత్సాహం ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణ ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న విద్యా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం విద్యా వారోత్సవాల్లో భాగంగా గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయంలో ఘనంగా కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి డీఈఓ రమేష్ కుమార్ మాట్లాడుతూ.. గ్రంథాలయాలు విద్యా వ్యవస్థలో జ్ఞాన కేంద్రాలుగా కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. విద్యార్థుల్లో పఠన అలవాటును పెంపొందించడం ద్వారా వారి సృజనాత్మకత, విశ్లేషణా సామర్థ్యం, ఆలోచనా శక్తి అభివృద్ధి చెందుతుందని ఆయన వివరించారు. "పుస్తకాలు మనకు నిజమైన మార్గదర్శకులు. తరగతి గదిలో నేర్చుకున్న జ్ఞానాన్ని మరింత విస్తరించాలంటే గ్రంథాలయ పఠనం అత్యంత అవసరం" అని రమేష్ కుమార్ అన్నారు. ఆధునిక సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా పుస్తకాల ద్వారా లభించే లోతైన జ్ఞానానికి ప్రత్యామ్నాయం లేదని ఆయన స్పష్టం చేశారు. విద్యార్థులు రోజువారీ జీవితంలో కనీసం కొంత సమయాన్ని పుస్తక పఠనానికి కేటాయించాలని ఆయన సూచించారు. ముఖ్యంగా పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, అందుబాటులో ఉన్న పుస్తకాలు, రిఫరెన్స్ మెటీరియల్‌ను ఉపయోగించుకోవడం ద్వారా తమ లక్ష్యాలను సులభంగా చేరుకోవచ్చని ఆయన తెలిపారు. గ్రంథాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను కూడా ఆయన ఈ సందర్భంగా వివరించారు. ప్రతి విద్యార్థికి సులభంగా జ్ఞానం అందించాలనే లక్ష్యంతో గ్రంథాలయ వ్యవస్థను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి కురుమయ్య, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి కిరణ్ కుమార్, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శివాలయంలో ఘనంగా మాస కళ్యాణోత్సవం



**మునుగోడు మే 15 క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండల కేంద్రంలోని శ్రీ శివరామ ఆలయములో శుక్రవారం మాస శివరాత్రి సందర్భంగా శివ పార్వతుల మాస కళ్యాణోత్సవం ఘనంగా జరుపుకున్నారు..సర్పంచ్ పాలకూరి రమాదేవి నరసింహ గౌడ్ లు కళ్యాణంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు..శివుని అనుగ్రహంతో ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని కోరారు.అర్చకులు బొల్లోజు శ్రీకాంత్,తిరందాసు శ్రవణ్,గ్రామస్థులు పాల్గొన్నారు..

# జిహెచ్ఎంసి ఎన్నికల్లో

- బీసీవై పార్టీ కార్యాచరణ
- డాక్టర్ చిలకల శ్రీనివాస్ యాదవ్

**చౌటుప్పల్, మే 15, క్రైమ్ మిర్రర్ :** తెలంగాణలో బహుజనలకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలనే లక్ష్యంతో పార్టీ క్రమంగా బలపడుతోందని,రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బీసీవై పార్టీ కార్యచరణ రూపొందిస్తుందని డాక్టర్ చిలకల శ్రీనివాస యాదవ్ అన్నారు. శుక్రవారం జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్ చంద్రకళను కలిసి ప్రజా సమస్యలపై పలు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా చిలకల శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ. ఈ కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌లో ప్రముఖ అధికారి ఆర్. కర్ణన్ ని బీసీవై పార్టీ తెలంగాణ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పలు కీలక అంశాలపై సుదీర్ఘంగా చర్చించిన్నట్లు తెలిపారు.రాబోయే జిహెచ్ఎంసి ఎన్నికల్లో పార్టీ కార్యాచరణ, ప్రజా సమస్యలు, అభివృద్ధి కార్యక్రమాలు, బీసీల రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించిన్నట్లు వారు పేర్కొన్నారు. పేద ప్రజల కాలనీలలో మౌలిక వసతులు కల్పన, చెత్త సమస్య, కాలువల శుభ్రత,వీధి దీపాల ఏర్పాటు, యువతకు ఉపాధి అవకాశాలు అంశాలపై చర్చించినట్లు తెలిపారు. బీసీవై పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ నాయకత్వంలో పార్టీ వేగంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరిస్తుందని పేర్కొన్నారు. బహుజనుల ఆత్మగౌరవం, సామాజిక న్యాయం, యువత భవిష్యత్తు,ప్రజాసంక్షేమం అనే నాలుగు ప్రధాన లక్ష్యాలతో పార్టీ ముందుకు సాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా అధికారులు కూడా ప్రజా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జిహెచ్ఎంసి ఎన్నికల్లో ప్రజల ఆశయాలకు అనుగుణంగా పార్టీ పోటీ చేస్తుందని, ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వాన్ని అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీవై పార్టీ తెలంగాణ జిహెచ్ఎంసి కన్వీనర్ తేజో విజయకుమారి, బీసీవై పార్టీ తెలంగాణ పిఎసి మెంబర్స్ డా. చిలకల శ్రీనివాస్ యాదవ్, మేకల కార్తీక్ యాదవ్,మేకల వివేక్ యాదవ్, తీగల అశోక్ కుమార్ పాల్గొన్నారు.






## అసంపూర్తిగా వదిలేసిన రోడ్డును తక్షణమే పూర్తి చేయాలి.

**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండలములోని కల్వకుంట్ల నుండి వెల్మకన్నె వరకు గత రెండు సంవత్సరాల క్రితం మంజూరైన బిటీ రోడ్డు నిర్మాణాన్ని అసంపూర్తిగా వదిలేశారని రోడ్డు పనులు తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలని శుక్రవారం డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేయడం జరిగింది.డివైఎఫ్ఐ జిల్లా సహాయక కార్యదర్శి కట్ట లింగస్వామి మాట్లాడుతూ గతంలో ఉపఎన్నికల సందర్భంగా టిఆర్ఎస్ పార్టీ హామీ ఇచ్చి హామీ ప్రకారంగా శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానిక ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి అరకొర నిధులు కేటాయిస్తూ రోడ్డు నిర్మాణాము పూర్తికాకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలు వచ్చినప్పుడు మాత్రమే ఓట్ల కోసము అడపా దడప పనులను చేస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు కూడా ఈ యొక్క రోడ్డు గురించి మాట్లాడకపోవడం, ఎమ్మెల్యే గారి పైన ఒత్తిడి తీసుకురాకపోవడం గ్రామ ప్రజలను విస్మరించడమే అని అన్నారు. డివైఎఫ్ఐ గ్రామ కార్యదర్శి కట్ట ఆంజనేయులు, మండల ఉపాధ్యక్షులు కట్ట వెంకన్న, పివిఎమ్ నాయకులు పగిళ్ల యాదయ్య, గ్రామ నాయకులు అశోక్, కుక్కల కార్తీక్, ఇరుగుదెండ్ల గణేష్, సాయి తేజ, రామ్ చరణ్, గౌరీ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## మగ్గం నుండి రెడ్ కార్పెట్ మెట్ల వరకు

**తెలంగాణ నుండి కేన్స్ వరకు.**

**ఇక్కత్ హ్యాండ్లూమ్స్ అంబాసిడర్ రష్మీ ఠాకూర్ సందేశం.**



**ఎల్బీనగర్ మే 15, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** 200 సంవత్సరాల తెలంగాణ వారసత్వాన్ని ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లే అవకాశం నాకు లభించడం ఎంతో గర్వంగా, గౌరవంగా భావిస్తున్నానని మిస్ ఆసియా ఇంటర్నేషనల్, ఇక్కత్ హ్యాండ్లూమ్స్ అంబాసిడర్ భారత ప్రభుత్వ జౌళి మంత్రిత్వ శాఖ రష్మీ ఠాకూర్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. 2026 మే నెలలో 17 వ తేదీ నుండి 21 వరకు జరగనున్న 79వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ రెడ్ కార్పెట్‌పై భారతదేశానికి ప్రాతినిధ్యం వహించడం నాకు లభించిన గొప్ప అదృష్టమని అన్నారు. తెలంగాణ చరిత్రలో మొట్టమొదటిసారిగా పోచంపల్లి ఇక్కత్ చేనేత ప్రపంచంలోని అత్యంత ప్రతిష్ఠాత్మక రెడ్ కార్పెట్‌పై నడవబోతోంది.ఇది నా ఒక్కదాని గర్వం మాత్రమే కాదు, పోచంపల్లిలో మగ్గం ముందు కూర్చొని వందల గంటలు శ్రమించిన ప్రతి నేతన్న, నేతక్కల గర్వం. ఈ చారిత్రాత్మక అవకాశాన్ని అందించిన భారత ప్రభుత్వానికి, జౌళి మంత్రిత్వ శాఖకు, చేనేత అభివృద్ధి కమిషనర్ కార్యాలయానికి, వీవర్స్ సర్వీస్ సెంటర్ హైదరాబాద్‌కు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్, పోచంపల్లి టై & డై సంస్థలకు, గౌరవనీయులైన పోచంపల్లి నేతన్నలు, నేతక్కలు మరియు అందరికీ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. నన్ను ఇక్కత్ హ్యాండ్లూమ్స్ అంబాసిడర్‌గా నియమించి, ఈ చారిత్రాత్మక అవకాశాన్ని అందించినందుకు నా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు తన సందేశాన్ని పంచుకున్నారు. దీనికి సంబంధించిన, ఎల్బీనగర్ పద్మశాలి, చేనేత ప్రముఖులు, పోచంపల్లి ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ (అలాగే పోచంపల్లి టై & డై) సంస్థల ప్రతినిధులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

# పెండింగ్ లో ఉన్న కూలీలవేతనాలు వెంటనే విడుదల చేయాలి

- రెండుసార్లు ఫోటోలు తీసే విధానం రద్దు చేయాలి
- సిర్పంగి స్వామి
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి



**క్రైమ్ మిర్రర్ వలిగొండ:** గ్రామీణ ఉపాధి హామీ కూలీల బకాయిలు విడుదల చేయాలని బిబిజి రాంజీ చట్టాన్ని రద్దుచేసి జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తిరిగి పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేస్తూ దేశవ్యాప్తంగా సమ్మెలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని రెడ్ల రేపాక గ్రామంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేసిన అనంతరం వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘాలు దేశవ్యాప్తంగా చేసిన అనేక పోరాటాల ఫలితంగా పార్లమెంట్ లో వామపక్షాలు మద్దతుతో యూపీఏ కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ పేదలకు ప్రతి కుటుంబానికి వంద రోజుల పని గ్యారెంటీ చేస్తూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని 2005లో ఆమోదించింది.2006 అక్టోబర్ 2 నుండి దేశవ్యాప్తంగా అమలు చేస్తున్నారు.దీని ద్వారా కోట్లాదిమంది వ్యవసాయ వ్యవసాయ కార్మికులకు చిన్న, మధ్య తరగతి రైతాంగానికి చేతినిండా పని కల్పించబడింది. గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు పని కోసం పేదల వలసలు తగ్గాయి.గ్రామీణ వ్యవసాయ కార్మికులు వ్యవసాయ పనులలో కనీస వేతనాలను పెంచుకున్నారు.ఆడ మగ తేడా లేకుండా సమాన వేతనాలు దేశంలో మొదటిసారి అమలు జరిగాయి. కోట్లాది రూపాయలను కేంద్ర ప్రభుత్వం వేతనాల రూపంలో పేదలకు ఇవ్వడం వలన ప్రజల కొనుగోలు శక్తి పెరిగింది.పేదరికం అప్పుల ఊబి నుండి కోట్లాది నిరుపేద కుటుంబాలు బయటపడ్డాయి. 2008 లో ప్రపంచంలో ఆర్థికమాంద్యం వచ్చినప్పుడు భారతదేశాన్ని గట్టెక్కించినది గ్రామీణ ఉపాధి హామీ చట్టం పట్టణ ప్రాంతాల పేదలకు ఉపాధి పని పెట్టాలని,100 రోజుల పని దినాలను 200 రోజులకుపెంచాలని,రోజు కూలి రూ 600 ఇవ్వాలని దేశవ్యాప్తంగా ఆందోళన,పోరాటాలు ఉధృతం అవుతున్న తరుణంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేసింది. దీని స్థానంలో విబిజి రామ్ జి చట్టాన్ని తెచ్చింది.గతంలో 90 శాతం నిధులు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం 60 శాతం మాత్రమే ఇస్తాము 40 శాతం రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని నిర్ణయం చేసింది.పని దినాలను 125 రోజులకు పెంచినట్లే పెంచి వ్యవసాయ సీజన్ లో 60 రోజుల పనిని బంద్ చేస్తామని పేర్కొన్నది.కనీస వేతనం రోజు కూలి రూ 178 గా పేర్కొన్నది.ఇది రాజ్యాంగబద్ధ పని హక్కును హరించడమే.పని కల్పించే బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకో చూస్తున్నదని విమర్శించారు.రోజు కూలి రూ 307 ఇవ్వాలి,కానీ రూ 150 మించి పడటం లేదు,వీటిని కూడా అనేక గ్రామాలలో గత సంవత్సరం చేసిన పనికి ఇప్పటివరకు వేతనాలు ఇవ్వలేదు. ఇప్పుడు చేస్తున్న పనికి నాలుగు వారాలుగా వేతనాలు ఇవ్వలేదు.వారం వారం కూలీల వేతనాలు ఇవ్వాలి అనే చట్టం డైరెక్షన్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదు. ఎండలు తీవ్రంగా పెరుగుతున్నాయి,కానీ పని ప్రదేశంలో త్రాగడానికి నీరు నీడకు టెంటు,ఓ ఆర్ ఎస్,మెడికల్ కిట్ నువ్వంటే కనీస సౌకర్యాలు కల్పించడం లేదు. బిజెపి ప్రభుత్వం పేదలపై కక్షగట్టి పనిని తీసివేయాలని చూస్తున్నది.అందులో భాగమే అని ప్రదేశంలో ఉదయం సాయంత్రం ఫోటోలు ఆన్ లైన్ లో అప్లోడ్ చేయడానికి నేషనల్ మొబైల్ మోనటరింగ్ సిస్టం తెచ్చింది. అడవులు గుట్టలలో పని దగ్గర ఫోన్ సిగ్నల్స్ సరిగా లేక ఫోటోలు అప్లోడ్ కావడం లేదు. ఫలితంగా పని చేసిన కూలీలు పనికిరాని వారుగా రికార్డులలో నమోదుఅవుతున్నది. మరొకవైపు డ్రోన్ యంత్రం ద్వారా ఫోటోలు తీస్తున్న వాటిని లెక్కలోకి తీసుకోవడం లేదు. కొత్తగా ఐరిస్ ఫోటోలు తీస్తామంటున్నారు. మెట్ల వ్యవస్థను రద్దు చేశారు.పని దినాలు తక్కువ పేరుతో అసిస్టెంట్లను తీసి వేస్తున్నారు.ఆధార్ కార్డు,జాబ్ కార్డు, బ్యాంకు ఎకౌంటు నంబర్ల లింకు పేరుతో లక్షలాదిమంది జాబ్ కార్డులనుతొలగించారు. నిధులలో భారీ కోతవిధించారు. ఆన్లైన్ పేమెంట్ పేరుతో వేతనాలను పెండింగ్ లో పెడుతున్నారు. తక్షణమే ఈ విధానాలను రద్దు చేయాలి.అడిగినవారికి జాబ్ కార్డు ఇవ్వాలి, కూలీల పొట్ట కొట్టే విబిజి రాం జీ చట్టం రద్దు చేయాలి.పాత మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలి. పట్టణ పేదలకు ఉపాధి పని కల్పిస్తాం పని దినాలను 150 రోజులకు పెంచుతాం, రోజు కూలి రూ 400 ఇస్తాం అన్న కాంగ్రెస్ ప్రభుత్వం హామీ లను అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కూలీలుహైమద్, మల్లమ్మ, కందుల లక్ష్మమ్మ, రాములమ్మ, కందుల నరసింహ, పద్మ,లింగమ్మ, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రాంత కళాకారుల కోసం 'అహర్యాస్' ఈ- కామర్స్ వెబ్ సైట్ ని ప్రారంభించిన బి ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**వెబ్ సైట్ నిర్వాహకులు అవని రెడ్డి మిత్ర బృందాన్ని అభినందించిన కేటీఆర్**




**క్రైమ్ మిర్రర్, మల్కాజిగిరి :** గ్రామీణ ప్రాంతాల్లోని కళాకారులను , నైపుణ్యం కలిగిన యువతను ప్రపంచ మార్కెట్‌తో అనుసంధానించడానికి నేరెడ్మేట్ జె జె నగర్ కాలనీ కి చెందిన దేవ అవని రెడ్డి, ఆమె మిత్ర బృందం తయారు చేసిన 'అహర్యాస్' ఈ కామర్స్ వెబ్ సైట్ ని బి ఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీమంత్రి కేటీఆర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కే టి ఆర్ మాట్లాడుతూ భారతదేశంలోని గ్రామీణ ప్రాంతాలలోని కళాకారులు తయారుచేసే వస్తువులను నేరుగా అంతర్జాతీయంగా వినియోగదారులకు చేరవేయడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. దీని ద్వారా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా కళాకారులకు సరైన గుర్తింపు, ఆదాయం కల్పించడం,భారతీయ సంస్కృతిని, హస్తకళలను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకురావచ్చు అన్నారు. ఈ వెబ్సైట్ ద్వారా విరు చేసే కార్యక్రమం పర్యావరణానికి మేలు చేసే జీవనోపాధిని ప్రోత్సహించడం మరియు గ్రామీణ ప్రాంతాల వారి ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేస్తుందన్నారు. యువత ప్రభుత్వ ఉద్యోగాలు, రంగాలపై ఆధారపడకుండా తమకు నైపుణ్యం ఉన్న రంగంలో అవని రెడ్డి లాగా రాణించాలని కేటీఆర్ సూచించారు. తెలంగాణ సాంస్కృతి, సాంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేసే విధంగా కృషి చేస్తున్న అవని రెడ్డి మిత్ర బృందానికి అభినందనలు తెలిపారు.

# సమస్యలను పరిష్కరించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలం

**మహిళా భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం నియోజకవర్గంలోని సరూర్‌నగర్ డివిజన్ పరిధిలో నూతనంగా నిర్మించిన మహిళా భవనాన్ని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళల అభివృద్ధి, సంక్షేమమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. మహిళలకు ఆర్థిక, సామాజిక పరంగా మరింత బలాన్ని చేకూర్చేందుకు గతంలో కేసీఆర్ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందని తెలిపారు. మహిళా భవనం ద్వారా స్థానిక మహిళలకు సమావేశాలు, శిక్షణ కార్యక్రమాలు, అవగాహన సదస్సులు మరియు వివిధ సేవలు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో ప్రస్తుత ప్రభుత్వం తగిన చొరవ చూపడం లేదని విమర్శించారు. పేదలు, కార్మికులు, మహిళలు, యువత కోసం ప్రత్యేక పథకాలు అమలు కావాలని ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ప్రజలకు న్యాయం జరిగేలా మంచి పాలన అందించడమే కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యమని కానీ ఇప్పుడున్న ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన ఏ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని తప్పుడు వాగ్దానాలతో కాలం వెళ్ళబుచుతున్నారని పేర్కొన్నారు. అలాగే రోడ్ల విస్తరణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి గతంలో పలు చర్యలు తీసుకున్నామని గుర్తుచేశారు. మొదట్లో కొన్ని అభివృద్ధి పనులు ప్రజలకు అర్థం కాలేదని, కానీ తరువాత వాటి ప్రయోజనాలు స్పష్టంగా కనిపించాయని అన్నారు. చిన్న రోడ్లను విస్తరించడం ద్వారా ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని భావించామని, అయితే కొన్ని ప్రాంతాల్లో ఇంకా ట్రాఫిక్ జామ్ సమస్యలు కొనసాగుతున్నాయని, ఏది ఏమైనా ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అన్ని అమలుపరిచే అంతవరకు ప్రజల పక్షాన పోరాడుతామని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ డివిజన్‌కు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# రైతులను అరిగోస పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం



**ఆత్మకూరు(ఎం),మే15/క్రైమ్ మిర్రర్:** రైతులు ఆరుగాలం కష్టం చేసి రాత్రనకా పగలనకా ఎండనక వాననక ఎన్నో అవస్థలు పడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి నెలలు గడుస్తున్నా ధాన్యం కొనుగోలు చేయలేకపోతున్నా కాంగ్రెస్ ప్రభుత్వం 42 కిలోల తూకం జోకుతూ రైతులను నిలువు దోపిడీ చేస్తున్న ఐకెపి సెంటర్ నిర్వాహకులు మిల్లర్లు ప్రభుత్వం చూసి చూడనట్టు వదిలేస్తుంది.కనీసం ఐకెపి సెంటర్లలో ప్యాడి క్లీనర్లు ఏర్పాటు చేయలేదు.ధాన్యం రాశులపై కప్పుకోవడానికి తార్పాలీన్ పట్టాలు ఏర్పాటు చేయలేదు. కనీసం ఐకెపి సెంటర్లో మంచినీటి వసతి నీడ కూడా ఏర్పాటు చేయలేదు.అమాలి పైసలు ఎటు పోతున్నాయో కూడా తెలవదు.రైతులే స్వయంగా చెల్లిస్తున్నారు.ఈ ప్రభుత్వంలో ఉన్న ఎమ్మెల్యేలు ఎంపీలు గొప్పలు చెప్పుకుంటున్నారు.అయ్యా రండి మీరు చెప్పిన ఐకెపి సెంటర్ కి బిజెపి నాయకులు రావడానికి సిద్ధం మీరు వస్తారా నెలలు గడుస్తున్న రైతుల కోసం ఎందుకు పట్టించుకుంటలేరు రైతుల ఉసురు తగిలి కాంగ్రెస్ ప్రభుత్వం కూలడం ఖాయం కొనుగోలు ప్రక్రియ వేగవంతం చేయాలి 40 కిలోల తూకం వేసే విధంగా చూడాలి.తార్పలీన్లు ఏర్పాటు చేయాలి.అమాలి డబ్బులు రైతుల ఖాతాలో వెయ్యాలి లేనిపక్షంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎంపీల మినిస్టర్లను ఎక్కడకు తిరగనీయం అని భారతీయ జనతా పార్టీ హెచ్చరిక చేస్తుంది.

# తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారులు ప్రజా భవనం ముందు నిరసన

**ప్రభుత్వం సానుకూల స్పందన**

**వారం రోజులు లలో కమిటీ ఏర్పాటు అని హామీ**

**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో:** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓరుగంటి ఆనంద్ పిలుపుమేరకు తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమకారులకు ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని వివిధ జిల్లాలో ఉన్న ఉద్యమకారులందరూ హైదరాబాద్ ప్రజా భవన్ ముందు నిరసన చేశారు .ప్రభుత్వం అన్ని జిల్లాల్లో తెలంగాణ ఉద్యమకారుల ను అక్రమ అరెస్ట్ లు చేసినా కూడా పెద్ద ఎత్తున ఉద్యమకారులు ప్రజా భవన్ దగ్గరికి వెళ్ళారు .ఈ క్రమంలో నిరసన చేస్తున్న ఉద్యమకారులను పోలీస్ అధికారులు ప్రజాపాలనలో వినతి పత్రాలను స్వీకరిస్తున్న (తీసుకుంటున్న) అధికారి చిన్నారెడ్డి దగ్గరకు తీసుకొని వెళ్లారు . ఆయన సీఎం ముఖ్య కార్యదర్శి అయిన శేషాద్రి కి లెటర్ రాశారు ఆ లెటర్ ను తీసుకొని ఉద్యమకారుల ప్రతినిధులను వెంటబెట్టుకుని పోలీసులు తమ వాహనంలో సెక్రటేరియట్ కి తీసుకెళ్లి అరవంతస్తులో ఉన్న సీఎం ముఖ్య కార్యదర్శి అయిన శేషాద్రి దగ్గరికి తీసుకెళ్లారు ఆయన ఉద్యమకారులతో మాట్లాడి వారి ఆవేదనను విని ముఖ్యమంత్రి ఆదేశానుసారం చర్చలు జరిపారు . ఈ సమస్య ఆల్రెడీ సీఎం రేవంత్ రెడ్డి దృష్టిలో కూడా ఉందని ఒక వారం రోజులలో కమిటీని ఏర్పాటు చేసి నిజమైన ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రిజిస్టర్డ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కె వి కృష్ణారావు పేర్కొన్నారు . ఈ సందర్భంగా ఉద్యమకారులు మాట్లాడుతూ జూన్ 2 లోపల స్పష్టమైన ఉద్యమకారుల గుర్తింపు కమిటీని ఏర్పాటు చేసి ఉద్యమకారులను గుర్తించి వారికి ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పెద్ద ఎత్తున నిరసనలు చేపడతామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య బచ్చల పద్మాచారి కేలోత్ రవిచంద్ర చౌహాన్ మొతుకురి వెంకటాచారి గాజుల రవి కుమార్ ఉపేందర్ రెడ్డబోయిన వరలక్ష్మి కామని అనంతలక్ష్మి నల్లా స్వరూప ధనలక్ష్మి కమలమ్మ ఆకారపు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు .



# ఇంట్లో భార్యాభర్తల కలహాల నేపథ్యంలో మహిళ అదృశ్యం

**మిస్సింగ్ కేసు నమోదు చేసిన, హయత్ నగర్ పోలీసులు**



**ఎల్బీనగర్ మే 15, క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** హయత్ నగర్ ఇన్స్పెక్టర్ నాగరాజుగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటున్న, విజయ్‌మంజుల పార్వతమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.గత వారం రోజులుగా భార్యాభర్తల మధ్య తరచూ గొడవలు జరుగుతున్నాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ క్రమంలో ఈ నెల 14వ తేదీ ఉదయం 8:30 గంటల సమయంలో మంజుల పార్వతమ్మ (38), గృహిణి, ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటికి వెళ్లిపోయింది. ఆమె కోసం బంధువుల ఇళ్లలో, తెలిసిన ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఎలాంటి ఆచూకీ లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాము అని నాగరాజు గౌడ్ తెలిపారు.మంజుల పార్వతమ్మ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని ఆయన కోరారు.

# పెళ్లికి వెళ్తానని వెళ్లి అదృశ్యం అయిన ప్రభుత్వ ఉద్యోగి, బానోతు భీమ్ సింగ్

**మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న, హయత్ నగర్ పోలీసులు**



**ఎల్బీనగర్ మే 15 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** బంధువుల పెళ్లికి వెళ్తానని ఇంటి నుంచి వెళ్లిన ప్రభుత్వ ఉద్యోగి అదృశ్యమైన ఘటన స్థానికంగా ఆందోళన కలిగించింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, బనోతు భీమ్‌సింగ్ (37) గత రెండేళ్లుగా భార్యతో కలిసి నివాసం ఉంటూ ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇటీవల అతడు బెట్టింగ్‌కు అలవాటు పడి అప్పులు చేయడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నెల 12వ తేదీ ఉదయం 8:30 గంటల సమయంలో బంధువుల పెళ్లికి వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అనంతరం ఇంటికి తిరిగి రాకపోవడంతో పాటు ఫోన్‌కూ స్పందించలేదు.బంధువుల ఇళ్లలో, తెలిసిన ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. ఈ మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భీమ్‌సింగ్ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

# రైతుల ధాన్యాన్ని తరుగు లేకుండా ప్రభుత్వము కొనుగోలు చేయాలి







**ఆత్మకూరు(ఎం),మే15/క్రైమ్ మిర్రర్:** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం)మండలం పల్లెర్ల గ్రామం మధిర సిద్దాపురంలో బిజెపి జిల్లా కిషన్ మోర్చా కార్యదర్శి బండారి సత్యనారాయణ శుక్రవారం రోజు సందర్శించి ప్రభుత్వం చొరవ తీసుకొని రైతుల ధాన్యాన్ని తరుగు లేకుండా తొందరగా ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు రేపాక యాదయ్య ,పద్మ సత్యనారాయణ, రమేష్, యాదయ్య, ఎలిమినేట్ సత్తయ్య,తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలి కార్పోరేషన్ చైర్మన్గా గూడూరు శ్రీనివాస్



**ఆత్మకూరు(ఎం),మే15/క్రైమ్ మిర్రర్:** తెలంగాణ ప్రభుత్వం పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్గ గూడూరు శ్రీనివాస్ నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆయనను హైదరాబాద్ సెక్రెటరియేట్ ఛాంబర్లో కలిసి ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలపడం జరిగింది. ఈ సందర్భంగా ప్రొపెసర్ ప్రముఖ పర్యావరణ వేత్త పిట్టల రవిబాబు మాట్లాడుతూ విదేశీ వస్త్రాలు ప్రకృతిని,పర్యావణాన్ని, భారతీయ సంస్కృతి, సప్రదాయపు విలువలను వస్త్రాలతో నాశనం చేస్తున్న సందర్భంలో మీ పదవి బాధ్యతలు దేశీయ సప్రదాయ చేనేత వస్త్రాల ఉత్పత్తి పెంచి దేశానికి చేనేత శ్రామికులకు కుటుంబాలకు బాసటగా నిలిచి, ఆర్థికంగా, సంప్రదాయంగా ఉపయోగపడేలా నిలుపుతాయని వాఖ్యణించారు. అదేవిధంగా ప్రముఖ సామాజిక కార్యకర్త రా చెరువు పరిరక్షణ సమితి సభ్యులు బోడుప్పల్ పద్మశాలి సంఘము ముఖ్య సలహాదారులు డా.లక్ష్మీవీర మల్లు నేత మాట్లాడుతూ గతకొన్ని దశాబ్దాలుగా చేనేత మగ్గం మూగబోయిందని, ఎలక్ట్రికల్ మగ్గం వచ్చాక అన్ని వర్గాలు కార్పొరేట్ వ్యవస్థలో చిక్కుకుని చేనేత కుటుంబాలు చితికి పోయే సందర్భం కృత్రిమ వస్త్రాలు అందంగా ప్లాస్టిక్ ఐరన్ మొదలైన చిన్న చిన్న అలంకరణలతో చిన్నారుల అనారోగ్యంకి కారణం అవుతాయేమో అనే భయం కూడా ఉందని కృత్రిమ వస్త్రాల వల్ల చేనేత కుటుంబాలు ఆర్థికంగా కుంటుబడిపోయాయని, ఎంతోమంది చేనేతలు అర్డర్లు లేకి,వస్త్రాలు తయారులేక, తయారు అయ్యాక అమ్మకాలు లేక కుటుంబాలు ఆర్థికంగా బతుకులు చితికి పోయి సిరిసిల్ల, వరంగల్, కరీంనగర్, నల్గొండ మొదలైన ప్రదేశాల్లో అనేకమంది ఆత్మహత్య చేసున్నారు.ఇప్పుడు నూతన పద్మ శాలి కార్పొరేషన్ చైర్మన్లుగా మీరు మన కుల వృత్తిని కాపాడే విషయంలో అత్యంత చొరవ తీసుకుని పద్మ శాలి బిడ్డల బతుకులు బాగుపడే విదంగా కృషి చేయాలని విజ్ఞప్తిచేశారు.మా విజ్ఞప్తికి చైర్మన్ స్పందిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి సాధ్యమైనంత మేరకు త్వరగా పద్మ శాలి కుటుంబ సభ్యుల సమస్యలు ఒక్కొక్కటిగా తీర్చే విదంగా కృషి చేస్తానని చెప్పారు.

## మంజూరైన సిఎంఆర్ఎఫ్ చెక్కును అందజేసిన మాజీ కార్పొరేటర్ అనిల్ కుమార్ యాదవ్



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** జిహెచ్ఎంసి 60వ డివిజన్ పాశ్ కాలనీ నివాసులు పార్వతమ్మ, నోముల అనిత ఆనారోగ్యంతో ఆసుపత్రిలో శస్త్ర చికిత్స చేయించుకోవడం జరిగింది. వారికీ ఆసుపత్రి ఖర్చులను రిలీఫ్ ఫండ్ ద్వారా మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో మాజీ కార్పొరేటర్ ఎనుగుల అనిల్ కుమార్ యాదవ్ మరియు అబ్బనమోని గోపి యాదవ్ దరఖాస్తు చేయించగా మంజూరైన 18 వేల రూపాయల చెక్కును పార్వతమ్మకు,16500 రూపాయల చెక్కును అనితకు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా పేదల ప్రజల ఆపత్కాలంలో ఆదుకోవాలని ఆకాంక్షించే నాయకురాలు సబితా ఇంద్రారెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ జటావత్ శ్రీను నాయక్, మాజీ కార్పొరేటర్లు మాదారి సురేఖ రమేష్, జిల్లా సౌందర్య విజయ్ కుమార్, మహిళా అధ్యక్షురాలు జమాల్పూర్ సునీత బాలరాజ్, మహిళా నాయకురాలు నిర్మల రెడ్డి నాయకులు సుదర్శన్ రెడ్డిలు పాల్గొన్నారు.

## ప్రియదర్శిని కాలనీలో కడుగు యాకూబ్ అనే వ్యక్తి అదృశ్యం



**ఎల్బీనగర్ మే 15 క్రైమ్ మిర్రర్ ప్రతినిధి:** ప్రియదర్శిని కాలనీలో నివాసం ఉంటున్న కడుగు యాకూబ్ (55) అనే వ్యక్తి అదృశ్యమైన ఘటన హయత్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం, యాకూబ్ తన భార్యతో కలిసి గత నాలుగేళ్లుగా పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 14వ తేదీ మధ్యాహ్నం నగదు విషయమై భార్యాభర్తల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం యాకూబ్ పండ్ల వ్యాపారం దగ్గర నుండి ఇంటికి వెళ్లిపోయాడు. సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి చేరుకున్న భార్యకు యాకూబ్ కనిపించలేదు,బంధువుల ఇళ్లలో, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె పోలీసులను ఆశ్రయించింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న హయత్ నగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. యాకూబ్ ఆచూకీ తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని పోలీసులు కోరారు.

## ఆరోగ్య శాఖ అధికారులతో కలెక్టర్ సమావేశం



**యాదాద్రి జిల్లా, మే 15,క్రైమ్ మిర్రర్ :** పిసిపి ఎన్డిటి జిల్లా అప్రూప్రియేట్ అథారిటీ సమావేశం కలెక్టర్,జిల్లా మేజిస్ట్రేట్ అనురాగ్ జయంతి అధ్యక్షతన మీటింగ్ హాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఇప్పటివరకు పీసీపీ ఎన్డీటి యాక్ట్ కింద స్కానింగ్ సెంటర్లు పర్మిషన్ కొరకు అప్లై చేసుకున్నటువంటి హాస్పిటల్స్ కు పర్మిషన్ ఇవ్వడానికి గల అంశాలపై చర్చించారు.ఈ సమావేశంలో ఈసమావేశంలో స్కానింగ్ సెంటర్ల పర్మిషన్ కొరకు అప్లై చేసుకున్నటువంటి స్కానింగ్ సెంటర్లను జిల్లా ఆపరేట్ అథారిటీ కమిటీ ఆధ్వర్యంలో ఇన్స్పెక్షన్ నిర్వహించి పర్మిషన్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశం సమావేశంలో పీసీపీ ఎన్డిటి కమిటీ మెంబర్స్, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మనోహర్, జిల్లా ఎడిషన్ ఎస్పి, ఎన్జీవో మెంబర్ డాక్టర్ ప్రమీల పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం , ఎంపీ చామల ను మర్యాద పూర్వకంగా కలిసిన రఘునాథ్ యాదవ్



**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** తెలంగాణ యాదవ సహకార సంస్థ లిమిటెడ్ ఛైర్మన్‌గా మారబోయిన రఘునాథ్ యాదవ్ కొత్త బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా, శుక్రవారం బీసీ సంక్షేమ మరియు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తో పాటు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. వారికి పుష్పగుచ్ఛం అందజేసి ఆశీస్సులు తీసుకున్నాను. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ పథకాల అమలు మరియు బీసీ శాఖా అభివృద్ధిపై వారితో సుదీర్ఘంగా చర్చించడం జరిగింది. యువ నాయకులు మారబోయిన రఘునాథ్ యాదవ్ కి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

## పెట్రోల్,డీజిల్ ధరల పెంపుతో ప్రజలనునట్టేట ముంచుతున్న మోడీ ప్రభుత్వం..

- కార్పొరేట్ దోపిడీకి కేంద్రం దాసోహం..
- సీపీఐ నేత పానుగంటి పర్వతాలు

**శేరిలింగంపల్లి క్రైమ్ మిర్రర్ :** శేరిలింగంపల్లి నియోజకవర్గ సిపిఐ కార్యవర్గ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పానుగంటి పర్వతాలు కేంద్ర ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశ ప్రజలపై మరోసారి పెట్రోల్, డీజిల్ ధరల భారం మోపుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ప్రజలను నట్టేట ముంచే ప్రయత్నం చేస్తోందని ఆయన మండిపడ్డారు. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకుతున్న సమయంలో ఇంధన ధరల పెంపు సామాన్య ప్రజలపై మరింత భారంగా మారిందన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెంపుతో రవాణా ఛార్జీలు పెరిగి కూరగాయల నుంచి కిరాణా సరుకుల వరకు అన్ని వస్తువుల ధరలు అమాంతం పెరుగుతున్నాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో డీజిల్ వినియోగం ఎక్కువగా ఉండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆటో కార్మికులు, లారీ డ్రైవర్లు, చిన్న వ్యాపారులు, మధ్యతరగతి ప్రజలు జీవన సంక్షోభంలోకి నెట్టబడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు తగ్గినా దేశంలో మాత్రం ఇంధన ధరలను తగ్గించకుండా కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లాభాలు చేకూర్చే విధంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ప్రజల రక్తాన్ని పీల్చి కార్పొరేట్ మిత్రులకు లాభాలు చేకూర్చే విధానాన్ని సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను మరిచిపోయి “అచ్చే దిన్” పేరుతో ప్రజలను మోసం చేసిన బీజేపీ ప్రభుత్వం ఇప్పుడు పన్నుల పేరుతో ప్రజల జేబులు ఖాళీ చేస్తోందని విమర్శించారు. వెంటనే పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని సిపిఐ డిమాండ్ చేసింది. లేనిపక్షంలో దేశవ్యాప్తంగా ప్రజలను చైతన్యపరుస్తూ పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని పానుగంటి పర్వతాలు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు టి. రామకృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు కె. వెంకటస్వామి, శేరిలింగంపల్లి కార్యదర్శి చందు యాదవ్, కె. ఖాసీం, జటి శ్రీనివాస్, బి. నారాయణ, ఎం. వెంకటేష్, నరసమ్మ, చంద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

